క్లుప్తంగా

సీఐ నాగ దుర్గారావుకు అభినందనలు



తుని సీఐ నాగదుర్గారావుకు ప్రశంసా పత్రం అందజేస్తున్న ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు

తుని: కేసుల సత్వర పరిష్కారం కోసం లోక్ ఆదాలత్‌ను సద్వినియోగం చేస్తున్న తుని పట్టణ సీఐ.ఎం.నాగదుర్గారావును జిల్లా ఎస్పీ ఎం.రవీంద్రనాథ్‌బాబు అభినందించారు. గురువారం కాకినాడ ఎస్పీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో దుర్గారావుకు ప్రశంసా పత్రాన్ని రవీంద్రనాథ్ బాబు అందజేశారు. తుని పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎక్కువ కేసులను లోక్ ఆదాలత్‌లో పరిష్కరించినందుకు ఎస్పీ ప్రశంసాపత్రం అందించినట్టు నాగ దుర్గారావు తెలిపారు.

ప్రజాసమస్యలపై నిరంతర పోరాటం

ఏలేశ్వరం: ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం చేస్తామని జైభీమ్ భారత్‌పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ దాడిశెట్టి వీరబాబు అన్నారు. మండలంలోని లింగంపర్తిలో గురువారం పార్టీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా గొడుగు కనకరత్నం, ఉపాధ్యక్షుడిగా పోతురాజు శ్రీను, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడిగా గాది గౌతమ్‌లను నియమించారు. ఈ సందర్భంగా వీరబాబు మాట్లాడుతూ పార్టీ అధ్యక్షుడు జడ శ్రవణ్‌కుమార్ నాయకత్వంలో నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేస్తామన్నారు. కార్యక్రమంలో తుర్లపాటి బాబులు, పార్టీశ్రేణులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఫిజియోథెరపీ సేవలు

కోటనందూరు: స్థానిక నాన్‌భవిత కేంద్రంలో దివ్యాంగ చిన్నారులకు గురువారం ఫిజియోథెరపీ సేవలందించారు. ఫిజియోథెరపిస్టు టీఎస్ఎస్ సోమేశ్వరరావు చిన్నారులతో వ్యాయామాలు చేయించారు. చిన్నారుల ఆరోగ్యం, రోజూ చేయించాల్సిన వ్యాయామాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

మోసాలపై విచారణ జరపాలి

ఏలేశ్వరం: డ్వాక్రా రుణాల పేరుతో గతంలో చేసిన మోసాలపై విచారణ జరపాలని పట్టణంలో డ్వాక్రా మహిళలు గురువారం ఆందోళన చేశారు. 2019లో 14 డ్వాక్రా గ్రూపులకు రుణాలు తీసుకుని సభ్యులకు ఇవ్వకుండా కొందరు వ్యక్తులు దోచేశారన్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ స్థానిక యూనియన్ బ్యాంక్ వద్ద ఆందోళన చేశారు. వీరికి సీపీఐ(ఎంఎల్)వినోద్ మిశ్రా పార్టీ సంఘీభావం తెలిపింది. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కొశిరెడ్డి గణేష్ మాట్లాడుతూ అప్పట్లో డ్వాక్రా గ్రూపుల పేరుతో సభ్యులకు డబ్బులు ఇవ్వకుండా యానిమేటర్స్, మెప్మా ఉద్యోగి మోసం చేశారన్నారు. ప్రస్తుతం రుణాలు కట్టాలని సభ్యులపై ఒత్తిడి తెస్తున్నారన్నారు. దీనిపై అధికారులు విచారణ చేపట్టి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గండేటి నాగమణి, సంకురమ్మ, సత్యవేణి, సత్యవతి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రౌతులపూడి: మండలంలోని గిడజాం ఫీడర్ పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ రత్నాలరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫీడర్ వార్షిక మరమ్మతులు, విద్యుత్ లైన్లపై ఉన్న చెట్ల కొమ్మలు తొలగింపు కారణంగా ఆయా గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్తు సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

స్వర్ణకారుడి ఇంట్లో చోరీ

ప్రత్తిపాడు: గ్రామంలో బుధవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సమీపంలోని స్వర్ణకారుడు కృష్ణవరపు శివ బసవలింగం బుధవారం రాత్రి యథావిధిగా తన ఇంటిలో తలుపులకు తాళం వేసి, పక్కనే ఉన్న తన బంధువుల ఇంటిలో నిద్రించాడు. గురువారం ఉదయం లేచి చూసే సరికి తలుపులు పగలగొట్టి ఉండడంతో లోనికి వెళ్లి చూడగా బంగారపు వస్తువుల తయారీ కోసం ఉంచిన 72 గ్రాముల బంగారం, రూ.1.10 లక్షల నగదు చోరీకి గురైనట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఆకాశంలో సుందర దృశ్యం

గోకవరం: ఆకాశంలో గురువారం రాత్రి సుందర దృశ్యం ఆవిష్కృతమైంది. ఒకే అక్షాంశంలోకి చంద్రుడు, రెండు నక్షత్రాలు వచ్చి కనువిందు చేశాయి. మునుపెన్నడూ ఇటువంటి దృశ్యం కనిపించకపోవడంతో ప్రజలు తమ సెల్ ఫోన్లలో బంధించి సోషల్ మీడియాలో పోస్టు చేశారు.



ఒకే అక్షాంశంలో కనువిందు చేస్తున్న చంద్రుడు, రెండు నక్షత్రాలు

బకాయిమే సవాల్ !

- తుని మున్సిపాలిటీలో ఏటా పేరుకుపోతున్న పన్నుల బకాయిలు
- ప్రస్తుతం రూ.4 కోట్లు దాటిన వైనం
- వసూలుకు ఇబ్బంది పడుతున్న అధికారులు



తుని పట్టణం వ్యూ



బకాయిలు పేరుకుపోయిన తుని గాంధీ సత్రం సముదాయం

తుని: పట్టణంలో ప్రజలకు అన్ని రకాల సేవలు, వసతులు అందించాలంటే ప్రజలు పన్నులు సకాలంలో చెల్లించాలి. ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన పన్నులను జమ చేయాల్సి ఉంది. ఇందుకు భిన్నంగా తుని పురపాలకసంఘం పరిధిలో పన్నుల బకాయిలు భారీగా పెరిగిపోయాయి. బకాయిల వసూలుకు అధికారుల సైతం తలలు పట్టుకుంటున్నారు. గ్రేడు–2 మున్సిపాలిటీ పరిధిలోనే ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి రూ.కోటి బకాయి ఉంది. ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన వివిధ కార్యాలయాలు ఉన్నాయి. ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలోనూ ఇదే అంశంపై చర్చ జరిగింది. బకాయిలను వసూలు చేసేందుకు అన్ని శాఖలకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు.

ఏటా రూ.8 కోట్ల డిమాండ్

తుని పురపాలక సంఘానికి సంబంధించి ఆస్తి, ఖాళీ స్థలాలు, నీటి పన్ను ద్వారా ఏటా రూ.8 కోట్ల మేర డిమాండ్ ఉంది. ఇందులో ఏటా 50 శాతం మేర మాత్రమే అధికారులు వసూలు చేస్తున్నారు. మిగిలిన 50 శాతంలో 25 శాతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన బకాయిలు ఉన్నాయి. తర్వాత స్థానంలో ఇంటి కుళాయిలకు సంబంధించి బకాయిలు ఉన్నాయి. ప్రభుత్వ పరంగా ఇచ్చే నిధులు అభివృద్ధి పనుల కోసం వినియోగిస్తున్నారు. కొన్ని అత్యవసర పనులకు పురపాలక సంఘం జనరల్ ఫండ్స్ నుంచి ఖర్చు చేయాల్సి ఉంది. ప్రస్తుత పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. అధికార యంత్రాంగం కాళ్లరిగేలా తిరిగినా ప్రజలు పన్నులు చెల్లించడం లేదు. బడా బాబులకు సంబంధించిన బకాయిలు ఎక్కువగా ఉన్నా అధికారులు నోరుమెదపలేక సతమతమవుతున్నారు. మున్సిపాలిటీ ఆర్థిక పరిస్థితిని మెరుగు పరుచుకోవడానికి అధికారులు చర్యలు చేపట్టారు.

బకాయిల వసూళ్లకు చర్యలు

పురపాలక సంఘం పరిధిలో పేరుకుపోయిన బకాయిల వసూళ్లకు ప్రత్యేక చర్యలు చేపట్టాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన కార్యాలయాలు, ప్రైవేటు యాజమానులకు నోటీసులు జారీ చేశాం. వచ్చే నెల 31 వరకూ సమయం ఇచ్చాం. అప్పటికీ స్పందించకపోతే కుళాయి పన్నుకు సంబంధించి బకాయిదారుల కుళాయి కనెక్షన్ తొలగిస్తాం. ప్రజలు పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలి.



– ప్రసాదరాజు, కమిషనర్, తుని

మున్సిపాలిటీ ఆదాయ వివరాలు

పన్ను	డిమాండ్ (రూ.కోట్లలో)	వసూలు (రూ.కోట్లలో)	బకాయిలు (రూ.కోట్లలో)
ఆస్తిపన్ను	5.87	2.94	2.16
ఖాళీ స్థలాలు	1.68	0.30	0.76
నీటి పన్ను	1.79	0.52	1.27

ప్రభుత్వ కార్యాలయాల బకాయిల వివరాలు

కార్యాలయం పేరు	పన్ను బకాయిలు (రూ.లక్షల్లో)
గాంధీ సత్రం	34,57,511
పోలీస్ శాఖ	41,07,721
గృహ నిర్మాణం	12,633
రోడ్లు,భవనాలశాఖ	1,30,198
రెవెన్యూశాఖ	12,71,008
అగ్నిమాపక	16,783
వ్యవసాయశాఖ	2,94,356
ఐసీడీఎస్	47,825
సబ్ జైలు	1,90,329
ఎంపీడీఓ	6,33,477
ఎంఈఓ	58,027
కోర్టు సముదాయం	1,28,015
పాండురంగ దేవస్థానం	37,959
మొత్తం బకాయిలు	1,09,86,042

మార్చి నెలాఖరు వరకూ ధాన్యం కొనుగోలు

తుని రూరల్: మెట్ట ప్రాంతంలో రైతుల సౌకర్యార్థం మార్చి నెలాఖరు వరకూ ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం అనుమతించిందని వ్యవసాయశాఖ తుని సహాయ సంచాలకులు సుంకర బుల్లిబాబు తెలిపారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఫిబ్రవరి 15తో ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు గడువు ముగిసిందన్నారు. మెట్ట ప్రాంతం కావడంతో తుని, కోటనందూరు, తొండంగి మండలాల్లో ఖరీఫ్ నాట్లు, కోతలు, నూర్పిళ్లు ఆలస్యంగా జరిగాయన్నారు. ఈ మూడు మండలాల్లో ఇంకా వరిపంట కుప్పలపై ఉందన్నారు. ఈ విషయాన్ని జాయింట్ కలెక్టర్ ఇలక్కియా దృష్టికి తీసుకువెళ్లగా ప్రభుత్వ అనుమతితో మార్చి నెలాఖరు వరకు గడువు పొగించినట్టు చెప్పారు. ఈ అకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రబీ ఈ–క్రాప్ బుకింగ్ చివరి దశకు చేరిందన్నారు. రైతులందరూ తప్పనిసరిగా ఈ–కేవైసీ నమోదు చేయించుకోవాలని సూచించారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

జగ్గంపేట: స్థానిక రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక వాకర్స్ క్లబ్, పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో రాజమహేంద్రవరానికి చెందిన గౌతమి నేత్రాలయం సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరాన్ని పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు చంద్రమౌళి వెంకటశాస్త్రి ప్రారంభించారు. గౌతమి నేత్రాలయం వైద్యులు 69 మందికి కంటి పరీక్షలు చేశారు. వీరిలో 15 మందికి కంటిలో శుక్లాలు ఉన్నట్లు గుర్తించి రాజమహేంద్రవరంలో ఆపరేషన్లు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ అధ్యక్షులు తోలేటి సూర్యనారాయణ, పెన్షనర్ల సంఘం కార్యదర్శి మల్లేశ్వరరావు, గౌతమి నేత్రాలయ డాక్టర్ సత్య, పెన్షనర్స్ సంఘం, వాకర్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

స్టాఫ్ నర్సుల రెగ్యులరైజేషన్‌కు కృషి

- మంత్రి దాడిశెట్టి రాజా



ఎస్.అన్నవరం క్యాంపు కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న మంత్రి రాజా

తుని: ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కాంట్రాక్ట్ నర్సులను రెగ్యులర్ చేసేందుకు తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. తుని మండలం ఎస్.అన్నవరంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో గురువారం సాయంత్రం ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సస్ వేల్ఫేర్ ఆసోసియేషన్ సభ్యులు మంత్రి రాజాను కలిసి తమ సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర వ్యాప్తంగా 6234 మంది కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్నారని, వీరందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని యూనియన్ నాయకులు కోరారు. కోవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి సేవలు అందించామని, తమను రెగ్యులర్ చేసి కుటుంబాలను ఆదుకోవాలన్నారు. అంకితభావంతో పని చేస్తున్న కాంట్రాక్ట్ నర్సుల రెగ్యులర్ అంశాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్తానని మంత్రి రాజా హామీ ఇచ్చారు. యూనియన్ నాయకులు వెంకట ప్రభ, జ్యోతి, దుర్గా భవానీ, పద్మావతి పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

తుని: పేదలకు వైద్య సేవలు అందించడంలో దేశంలోనే రాష్ట్రం ప్రథమస్థానంలో ఉందని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. గురువారం సాయంత్రం తుని మండలం ఎస్.అన్నవరంలోని క్యాంపు కార్యాలయంలో తుని నియోజకవర్గానికి చెందిన ఆరుగురికి రూ.15.48 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంత్రి రాజా అందజేశారు. ప్రభుత్వం అన్ని రకాల వైద్యసేవలకు ఆరోగ్యశ్రీని అమలు చేస్తోందన్నారు. కొందరు అత్యవసర పరిస్థితుల్లో సొంత సొమ్ముతో వైద్యం చేయించుకుని ప్రాణాలను, వీరందరికీ సీఎం సహాయ నిధి నుంచి ఆర్థిక సహాయం అందిస్తున్నట్టు తెలిపారు.

విద్యకు అధిక ప్రాధాన్యం

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గోకవరం: రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. స్థానిక సంజీవయ్యనగర్‌లోని కేవీఎస్ కళాశాల 17వ వార్షికోత్సవంలో గురువారం ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విద్యాభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. విద్యార్థులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉన్నత విద్యను అభ్యసించడం ద్వారా మంచి రంగాల్లో స్థిరపడవచ్చన్నారు. గతంతో పోలిస్తే మహిళలు అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారని, మహిళా సాధికారితకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మహిళలు రిజర్వేషన్లు, ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. అనంతరం విద్య, క్రీడల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, పార్టీ మండల కన్వీనర్ పాటి రాంబాబు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, నాయకులు కర్రి సూరారెడ్డి, దాసరి రమేష్, సుంకర వీరబాబు, టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్, నరాలశెట్టి నర్సయ్య, తోలేటి రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాలు బలోపేతం

వైఎస్సార్ సీపీ జిల్లా అనుబంధ విభాగాల బలోపేతానికి పార్టీ అధిష్టానం చర్యలు తీసుకుంది. ఈ మేరకు జిల్లాలోని పలు అనుబంధ విభాగాలకు అధ్యక్షులను నియమించింది. పార్టీ పటిష్టతకు ఆయా విభాగాల నాయకులు కృషి చేయాలని ముఖ్యమంత్రి జగన్ సూచించినట్టు పార్టీ అనుబంధ విభాగాల రాష్ట్ర కోఆర్డినేటర్ చెవిరెడ్డి భాస్కరరెడ్డి తెలిపారు.

బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా ఈగల అప్పారావు



జి.కొత్తపల్లిలో బీసీ సెల్ అధ్యక్షుడు అప్పారావును అభినందిస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

శంఖవరం: వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడిగా మండలంలోని జి.కొత్తపల్లి గ్రామానికి చెందిన మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఈగల అప్పారావు నియమితులయ్యారు. దీంతో గురువారం అప్పారావుకు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ శాలువా కప్పి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీసీ సామాజిక వర్గానికి చెందిన అప్పారావు కుటుంబం మొదట నుంచి రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉందన్నారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను పూర్తిస్థాయిలో నిర్వహించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఈగల అప్పారావు మాట్లాడుతూ తనను పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా నియమించిన ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ నరాల శ్రీను, పార్టీ ఇన్‌చార్జి బుర్ర లచ్చబాబు, ఎడ్ల సత్యనారాయణ, ఈగల గంగ, బొట్టా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా రాజు



చింతల రాజు

ప్రత్తిపాడు రూరల్: వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా మండలంలోని బురదకోట గిరిజన గ్రామానికి చెందిన చింతల రాజు నియమితులయ్యారు. ఈ మేరకు చింతల రాజుకు వైఎస్సార్ సీపీ మండల నేత రామిశెట్టి చినబాబు, ఆ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా చింతల రాజు మాట్లాడుతూ తనను ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా నియమించిన ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో అప్పగించిన ఈ బాధ్యతకు పూర్తి స్థాయిలో న్యాయం చేసి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు.

ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా కుమారరాజా



శెట్టిబత్తుల కుమార్‌రాజా

అన్నవరం: వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా అన్నవరం సర్పంచ్ శెట్టిబత్తుల కుమార్ రాజా నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అనుబంధ విభాగాల కో–ఆర్డినేటర్ చెవిరెడ్డి భాస్కరరెడ్డి ఆదేశాలు జారీ చేశారు. కుమార్ రాజా గతంలో శంఖవరం ఎంపీపీగా, అన్నవరం ట్రస్టుబోర్డు సభ్యుడిగా, ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పని చేశారు. తనకు ఈ పదవి వచ్చేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేస్తానని చెప్పారు.

జల జీవన్ మిషన్‌పై అవగాహన ర్యాలీ

కిర్లంపూడి: రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని ప్రజలు మంచినీటిని పొదుపుగా వాడుకోవాలని తామరాడ సర్పంచ్ తోట అయ్యన్న సూచించారు. మండలంలోని తామరాడ పంచాయతీ పరిధిలో గురువారం జల్ జీవన్ మిషన్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అయ్యన్న మాట్లాడుతూ ప్రభుత్వం జల జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చితాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుందన్నారు. రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. వైస్ సర్పంచ్ కాయల శివ, సచివాలయ కన్వీనర్లు పెదిరెడ్డి లక్ష్మణ్, అడబాల శ్రీను, సచివాలయ సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అన్నసమారాధనలు

గోకవరం: గ్రామంలో ప్రసిద్ధిగాంచిన పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద గురువారం భారీ అన్నదానం నిర్వహించారు. శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని గ్రామస్తుల సహకారంతో ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం ఏర్పాటు చేశారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు స్వామి వారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుమారు ఆరు వేల మంది భక్తులు పాల్గొని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అన్నదానం

కిర్లంపూడి: మండలంలోని వీరవరంలో వేంచేసిన సాయిబాబా ఆలయం వద్ద గురువారం అన్నసమారాధన నిర్వహించారు. స్థానిక, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

విద్యార్థులతో ముచ్చటించిన రిటైర్డ్ ఐఏఎస్



బెండపూడి విద్యార్థులతో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఉష కుమారి, ఉపాధ్యాయులు

తొండంగి: మండలంలోని బెండపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో అమలు చేస్తున్న ఆంగ్ల అభ్యసన విధానాన్ని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఉషకుమారి గురువారం పరిశీలించారు. బెండపూడిలో జెడ్పీ హైస్కూల్ విద్యార్థులతో ఆమె ముచ్చటించారు. ఆంగ్ల భాషలో విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలకు దీటుగా మాట్లాడటంపై విద్యార్థులను, అందుకు తర్ఫీదు ఇస్తున్న ఉపాధ్యాయులను అభినందించారు. విద్యార్థుల ప్రతిభను మెచ్చుకుని భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

ప్రపంచ పరిజ్ఞానంపై దృష్టి పెట్టాలి

తుని: భవిష్యత్‌లో ఉన్నత ఉద్యోగాలు, చదువు కోసం విద్యార్థులు ప్రపంచ పరిజ్ఞానంపై దృష్టి సారించాలని ఏపీ హ్యూమన్ రిసోర్స్ ఎక్స్‌అఫీషియో కార్యదర్శి చక్రపాణి అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా జ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. ప్రతిరోజూ తెలుగు, ఆంగ్ల దినపత్రికలను చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. కరెంట్ ఆఫైర్స్‌పై అవగాహన ఉంటే భవిష్యత్‌లో ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్,ఐఎఫ్ఎస్ సర్వీసులను సులువుగా సాధించవచ్చన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.సుజాత, కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కలిదిండి సత్యనారాయణ రాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌కు గురై తీవ్ర గాయాలు

తుని రూరల్: హంసవరం చెరువుగట్టుపై వ్యవసాయ పనులు చేస్తుండగా వేలాడుతున్న విద్యుత్ వైర్లు తగలడంతో (షాక్) కూలీకి తీవ్రగాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. తుని మండలం హంసవరంలో వ్యవసాయ పనులు చేసేందుకు గురువారం అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం అంకంపాలేనికి చెందిన సత్యనారాయణ వెళ్లాడు. చెరువుగట్టుపై వ్యవసాయ పనులు చేస్తుండగా స్తంభం ఒక పక్కకు ఒరిగిపోయి కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు తగిలాయి. దీంతో సత్యనారాయణకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందడంతో పాయకరావుపేట 108 అంబులెన్స్ సంఘటన స్థలానికి చేరుకుంది. టీఎంసీ శ్రీనివాస్, పైలెట్ రాము అత్యవసర వైద్యసేవలు అందించి, క్షతగాత్రుడిని తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అందించినా పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్య సేవలకు కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి నుంచి అందిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్సై ఎ.బాలాజీ తెలిపారు.

గ్రామ వలంటీర్ మృతి

తొండంగి: మండలంలోని పెరుమాళ్లపురం పంచాయతీ కొత్తచోడిపల్లిపేట గ్రామానికి చెందిన వలంటీర్ గంపల సత్య (23) అనారోగ్యంతో గురువారం మృతి చెందినట్టు పంచాయతీ కార్యదర్శి వాడ్రేవు చక్రవర్తి తెలిపారు. గ్రామ వలంటీర్‌గా మెరుగైన సేవలందించిన సత్య గత కొంత కాలంగా గుండె సంబంధిత సమస్యతో కాకినాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆరోగ్యం విషమించడంతో గురువారం మృతి చెందారు. ఇటీవల ఆమెకు వివాహమైంది. ఆమె మృతికి గ్రామ సచివాలయ సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

ఘనంగా నూకాలమ్మ తొలి గరగ ఉత్సవం

కిర్లంపూడి: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి కిర్లంపూడి నూకాలమ్మ అమ్మవారి తొలి గరగ ఉత్సవం గురువారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ ధర్మకర్తలు ముద్రగడ నాయుడు, ముద్రగడ సీతాపతిరావు, ముద్రగడ రాజా, ముద్రగడ సురేష్ ఆధ్వర్యంలో పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజల చేసి తొలి గరగ ఉత్సవాన్ని ప్రారంభించారు. డప్పు వాయిద్యాలు, బాణాసంచా కాల్పుల నడుమ గరగను పురవీధుల్లో ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు గరగ మహోత్సవాన్ని తిలకించి, అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

తుని: గుల్లిపాడు రైల్వేస్టేషన్ యార్డులో రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని తుని జీఆర్పీ ఎస్సై ఎస్‌కే అబ్దుల్ మారూఫ్ తెలిపారు. గురువారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం గుల్లిపాడు రైల్వేస్టేషన్‌లో 30 ఏళ్ల వయసు కలిగిన వ్యక్తి విశాఖపట్నం నుంచి విజయవాడ వైపు వెళుతున్న గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుని వద్ద లభించిన సెల్‌ఫోన్ ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తున్నామని మారూఫ్ తెలిపారు. మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు.

అనధికార బ్లాస్టింగులపై ఆందోళన

ప్రత్తిపాడు: మండలంలోని పెదశంకర్లపూడిలో నల్ల క్వారీల వద్ద రిగ్ బ్లాసింగ్‌లతో ప్రజలు ఉలిక్కిపడుతున్నారు. అనధికారికంగా జరుగుతున్న బ్లాస్టింగ్‌లపై ఫిర్యాదులిచ్చినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదంటూ ప్రజలు ఆరోపిస్తున్నారు. గురువారం నిర్వహించిన క్వారీ బ్లాస్టింగ్ వల్ల వెలువడిన భారీ శబ్దానికి గ్రామస్తులు ఇళ్లల్లో నుంచి బయటకు పరుగులు తీశారు. చిన్నారులు, వృద్ధులు ప్రాణభయంతో వణికిపోయారు. సాయంత్రం నల్లరాయి క్వారీ వద్ద గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా జరుగుతున్న బ్లాస్టింగ్‌లపై 2018 నుంచి మైనింగ్, ఫారెస్టు, పోలీసు శాఖల అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. ఈ మేరకు అధికారులు క్వారీ ప్రదేశాన్ని తనిఖీ చేసి, క్వారీ పేలుడు వల్ల ప్రమాదం ఉందంటూ ఉన్నతాధికారులకు నివేదికలు అందించారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే అనధికార బ్లాస్టింగ్‌లను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మొరుకుర్తి వెంకన్నబాబు, ఏసుబాబు, గొంప వీరబాబు, బూర శ్రీను, నాగళ్ల శివనాగేంద్ర పాల్గొన్నారు.

గోవిందమాల దీక్షాధారణ

తుని రూరల్: మండలంలోని ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో పలువురు భక్తులు గురువారం గోవిందమాల దీక్షాధారణ చేశారు. దీక్ష చేపట్టిన భక్తులు వచ్చే నెల 2న దీక్షను విరమిస్తారు. దేవస్థానాన్ని ఆనుకుని నిర్మించిన శ్రీవారి పుష్కరిణిని రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా దంపతులు మార్చి 1న ప్రారంభించి, మహాలక్ష్మి అమ్మవారు, పాండురంగస్వామి, వరాహ స్వామి, హయగ్రీవ, పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. ఈ నెల 24 నుంచి మార్చి ఒకటి వరకు జరిగే ప్రతిష్ఠాపన మహోత్సవాల్లో భాగంగా భక్తులు గోవిందమాల దీక్షాధారణ చేపట్టినట్టు దేవస్థానం చైర్మన్ కోలా భీమేశ్వరరావు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం గోపూజ, వాస్తు హోమం, ప్రతిష్ఠించనున్న విగ్రహాలతో శోభాయాత్ర నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలకు రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, కాకినాడ ఎంపీ వంగా గీత, జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలను ఆహ్వానించినట్టు ఆయన వివరించారు.